మంజీరలో ఇసుకాసురులు..!

- కుర్లా సరిహద్దులో ఆగని దందా
- ఓవర్ లోడ్‌తో దర్జాగా తరలింపు
- లారీలు, టిప్పర్‌లతో జోరుగా రవాణా


మంజీర వద్ద క్యూ కట్టిన లారీలు


మంజీర వద్ద లారీలో ఇసుకను నింపుతున్న దృశ్యం

మద్నూర్(జుక్కల్) : ఎన్నికల నేపథ్యంలో అధికారులు బీజీగా ఉండడంతో ఇసుక అక్రమ వ్యాపారులకు ఆడింది ఆటగా పాడింది పాటగా మారింది. మంజీరాలోంచి ఇసుకను తోడేస్తూ వేరే ప్రాంతాలకు దర్జాగా తరలిస్తున్నారు. యధేచ్ఛగా ఇసుకను ఓవర్ లోడ్‌తో తరలిస్తున్నారు. డోంగ్లీ–బీర్కూర్ రెండు మండలాల సరిహద్దులోని మంజీరా వాగులో ఇసుక రవాణా దందా సాగుతోంది. మండలంలోని కుర్లా–ఖత్‌గావ్ గ్రామాల శివారులోని ప్రధాన రహదారి గుండా జేసీబీలతో మంజీరాలో తవ్వకాలు జరిపి ఇసుకను లారీల్లో నింపి తరలిస్తున్నారు.

వేబిల్లులతో దోబూచులాట..

నిబంధనలతోనే ఇసుకను తవ్వుతున్నామని వే బిల్లులతోనే ఇసుకను తరలిస్తున్నామని వారు చెప్పుకోస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిత్యం వందల సంఖ్యలో లారీల్లో ఓవర్‌లోడ్‌తో ఇసుకను తరలించడం ద్వారా రోడ్లన్ని నాశనం అవుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంజీరా వాగు వద్ద రోడ్డుపై నిత్యం ఇసుక లారీలు ఇష్టంవచ్చినట్లు పెట్టడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంజీర నది నుంచి ఇసుకను తరలించేందుకు లారీలు, టిప్పర్లు క్యూ కడుతున్నాయి. అక్కడి నుంచి ఇసుకను లోడ్ చేయించి జాతీయ రహదారి మీదుగా జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. హైదరాబాద్, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు ఇసుక తరలివెళ్తున్న పట్టించుకునే వారు కరువయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో ఇక్కడ ఇసుక దందాను నడిపించిన వారంతా రాజకీయ అండదండలతో తమ దందాను నిరాటంకంగా సాగిస్తున్నరని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని మంజీరా వాగులోంచి ట్రాక్టర్లు, బోలేరోల ద్వారా మరికొందరు వ్యక్తులు అక్రమ ఇసుక తరలిస్తు గ్రామాల్లో అధిక డబ్బులకు ఇసుకను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆయా గ్రామాల్లో ఇసుకను డంప్ చేసి విక్రయిస్తున్నారు. పోలీసులు ఇసుక వాహనాలను పట్టుకొని కేసులు చేస్తున్నప్పటికీ వారు పద్ధతి మాత్రం మార్చుకోవడం లేదు. జేసీబీలతో మంజీరాలో ఇష్టం వచ్చినట్లు ఇసుకను తోడేస్తుండడంతో భూగర్భ జలాలు అంతరించే పోయే పరిస్థితి వచ్చిందని రైతులు మండిపడుతున్నారు. ఇసుక తరలింపుతో బోరుబావులు వట్టిపోతున్నాయని వారు ఆవేదన చెందుతున్నారు. పోలీసులు, అధికారులు ఇసుక దందాపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు


ధాన్యంలో మొలకలను చూపుతున్న రైతులు

దోమకొండ : మండలంలోని సంఘమేశ్వర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం కొనుగొలు చేయక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగిల్‌విండో ఆధ్వర్యంలో గ్రామంలో కోనుగోలు కేంద్రంను ఏర్పాటు చేశారు. రైతులు కొనుగొలు కేంద్రం వద్ద కుప్పలు పోశారు. 20 రోజుల నుంచి తమ ధాన్యం ఇంతవరకు తూకం వేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులకు ఒక లారీ వస్తుందని, దీంతో వరి ధాన్యం కుప్పలు అలాగే ఉంటున్నాయని తెలిపారు. ధాన్యం కుప్పలు తూకం వేయకపోవడం వల్ల వర్షానికి కురిసి మొలకలు వస్తున్నాయన్నారు. సింగిల్‌విండో అధికారులకు, వ్యవసాయశాఖ అధికారులకు తెలియజేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో 2వేల బస్తాలను కొనుగోలు చేయగా వాటిని కూడా లారీల రాకపోవడం వల్ల రైస్‌మిల్లులకు ఇంతవరకు తరలించలేదన్నారు. వెంటనే అధికారులు ధాన్యం కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ విషయంలో జిల్లా అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

రోడ్లపై మక్కలతో వాహనదారులకు అవస్థలు


రహదారిపై ఎండబోసిన మక్కలు

తాడ్వాయి (ఎల్లారెడ్డి) : మండలంలోని ఆయా గ్రామాల్లో రోడ్డుపై మక్కలు, వడ్లు పోయడంతో వాహనదారులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రైతులు తాము పండించిన పచ్చి మక్కలను ఎండేందుకు తరచుగా రహదారిపై పోస్తున్నారు. మక్కలతో పాటు వరిధాన్యాన్ని కూడా రోడ్లపై పోస్తున్నారు. అధికారులు, పోలీసులు పంట దినుసులను రోడ్లపై పోయవద్దని ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని వాహనదారులు అంటున్నారు. రోడ్లపై మక్కలు పోయడంతో వాహనదారులు ఎన్నోసార్లు జారిపడ్డారు. రోడ్లపై కుప్పలు పోయడంతో రాత్రివేళల్లో దగ్గరకు వచ్చేవరకు కనిపించకుండా పోతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

భౌతిక దాడులను తిప్పికొడతాం


సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ గుప్తా

లింగంపేట(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీ నాయకులపై చేసిన దాడులను తిప్పికొడతామని బీజేపీ సీనియర్ నాయకుడు మాజీ ఎంపీపీ రామకృష్ణగుప్తా అన్నారు. మంగళవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఈనెల 12న అర్ధ రాత్రి తాను ఎల్లారెడ్డి వెళ్తుంటే నా కారును వెంబడించి 40 మంది కాంగ్రెస్ నాయకులు తనపై దాడి చేసి గాయపర్చి కారును ధ్వంసం చేశారన్నారు. తాము ఓడిపోతున్నామనే అక్కసుతో కాంగ్రెస్ దాడులకు పాల్పడడం సరికాదన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, రాంచందర్ తదితరులున్నారు.

‘అమృత్’ పనులకు మోక్షమెప్పుడో?

- బాన్సువాడ మున్సిపల్‌కు రూ.52 కోట్లు మంజూరు
- వచ్చే నెలలోనైనా ప్రారంభమయ్యేనా..?


బాన్సువాడలోని మున్సిపల్ కార్యాలయం

బాన్సువాడ: బాన్సువాడ మున్సిపల్ పరిధిలో అమృత్ 2.0 కింద మంజూరైన తాగునీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు సంబంధించిన నిధులకు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బ్రేక్ పడింది. ఈ పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాటు మున్సిపల్ వాటా నిధులతో చేపట్టేందుకు రూ.52 కోట్లను కేంద్రం గతేడాది మంజూరు చేసింది. వీటికి సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయింది. పనులు ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తుండగా లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు ప్రారంభించే అవకాశం లేకుండా పోయింది. కోడ్ ముగిశాకే పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

అగ్రిమెంట్ దశలో ఆగిన పనులు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాటు బల్దియా కూడా తమ వాటా చెల్లించి కొత్తగా పైపులైన్ల ఏర్పాటు, తాగునీటి ట్యాంక్‌ల నిర్మాణాలు, కుళాయి కనెక్షన్లు వంటి పనులు చేపట్టేలా మార్గదర్శకాలు జారీ చేసింది. అప్పుడే ఈ పనులను ప్రారంభించాల్సి ఉండగా టెండర్ల దాఖలుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు.

దీంతో పనులు నిలిచిపోయాయి. గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం కొద్ది రోజులు పక్కన పెట్టింది. గత ఫిబ్రవరిలో అనుమతులు ఇవ్వడంతో రాష్ట్ర స్థాయిలో మున్సిపల్ శాఖ మరోసారి టెండర్లను ఆహ్వానించింది. కాంట్రాక్టర్లు ముందుకు రావడంతో ఆ ప్రక్రియ పూర్తయింది. కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్ దశలో ఉండగా కోడ్ రావడంతో పనులు చేపట్టేందుకు అవకాశం లేకుండా పోయింది. జూన్ 4న ఎన్నికల్ కోడ్ ముగియడంతో పనులు తర్వాతనే ప్రారంభం అయ్యే అవకాశం ఉందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. అమృత్ 2.0 పనులు ఇప్పటికే పూర్తయితే వేసవి దృష్ట్యా తాగునీటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండేది కాదని పట్టణ వాసులు అంటున్నారు.

బాన్సువాడ బల్దియాలో అమృత్ 2.0 పథకం కింద చేపట్టే పనులు ఇవే...

- 18 లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు–1
- 7 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకు–1
- 5 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకులు –4
- 90 నుంచి 100 కిలోమీటర్ల పైపు లైను
- 8 వేలకు పైగా నల్లా కనెక్షన్లు ఇవ్వనున్నారు.

హరితహారం చెట్లు అగ్నికి ఆహుతి


బేగంపూర్‌లో కాలిపోయిన హరితహారం చెట్లు

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని బేగంపూర్ గ్రామ శివారులోని శ్మశాన వాటిక సమీపంలో తన పొలానికి నిప్పు పెట్టడంతో హరితహారం మొక్కలు కాలిపోయాయి.అలాగే పలు గ్రామాల్లో రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలు అగ్నికి ఆహుతవుతున్నాయి. ఇరువైపులా పంట పొలాలు కలిగిన రైతులు చెత్తకు నిప్పు పెడుతున్నారు. సంబంధిత అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తలు కష్టపడ్డారు


బోర్లం నాయకులతో పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ రూరల్ : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ విజయాన్ని ఆకాంక్షిస్తూ కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు బీఆర్ఎస్ బాన్సువాడ నియోజవర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం మండలంలోని బోర్లం గ్రామంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు పోచారం భాస్కర్‌రెడ్డిని కలిసి పోలింగ్ సరళి, అభ్యర్థి విజయ అవకాశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, పర్వారెడ్డి, గోపన్‌పల్లి సాయిలు తదితరులున్నారు.

నర్సుల సేవలు మరువలేనివి

పిట్లం(జుక్కల్): కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో పనిచేసిన నర్సుల సేవలు మరువలేనివని లయన్స్ క్లబ్ పిట్లం శాఖ అధ్యక్షుడు కిషన్ పేర్కొన్నారు. ఆయన మంగవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా పిట్లం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న నర్సులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కాశీరెడ్డి, శేఖర్ తదితరులున్నారు.


పిట్లంలో నర్సులను సన్మానించి జ్ఞాపికలను అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ప్రమాదకరంగా స్తంభం



మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని హనుమాన్ ఆలయ సమీపంలో విద్యుత్ స్తంభం చివల్లో విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ సీజన్‌లో విపరీతమైన గాలులు వీస్తున్నాయి. దీంతో విద్యుత్ స్తంబాలు, వైర్లు తెగిపడుతున్నాయి. ఏదైనా పెనూ ప్రమాదం జరగకముందే ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది విరిగిపోయిన స్తంభాన్ని మార్చాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

ఎన్‌సీసీ జాతీయ శిబిరానికి కెడెట్లు



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి జిల్లాలోని చిన్న మల్లారెడ్డి, పెద్దమల్లారెడ్డి, కామారెడ్డి బాలుర, ఆర్‌కే డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు పలువురు ఈనెల 25వ తేదీ వరకు మేడ్చల్ సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించే ఎన్‌సీసీ జాతీయ స్థాయి సమైక్యత, ఆర్మీపై అవగాహన తదితర శిక్షణ శిబిరానికి ఎంపికయ్యారు. మంగళవారం ప్రారంభమైన ఈ జాతీయ శిబిరంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 600 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొంటున్నారని చిన్నమల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఆధ్యాత్మికం

108 రకాల పండ్లతో కాలభైరవుడికి అలంకరణ



రామారెడ్డి : దక్షిణ కాశీ ప్రముఖ పుణ్యక్షేత్రం (ఇసన్నపల్లి) రామారెడ్డి శ్రీకాళభైరవుడికి ఆలయంలో వైశాఖ మాస వేడుకల్లో భాగంగా నిర్వహించే అలంకరణలు మొదటి మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి మంగళవారం 108 రకాల పండ్లతో కాలభైరవుడి అలంకరించారు. ఈనెల 21న రెండో మంగళవారం తీపి పదార్థాలతో, ఈనెల 28న మూడో మంగళవారం కూరగాయలతో, 4 మంగళవారం వచ్చేనెల 4న 108 రకాల పూలతో కాలభైరవుడిని అలంకరిస్తారు. భక్తులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు గుప్తా, ఆలయ అర్చకులు శ్రీనివాస్ శర్మ, వంశీకృష్ణ శర్మ, జూ.అ సురేందర్, నాగరాజ్ పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ వార్షికోత్సవం



నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని అచ్చంపేటలో రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం బోనాలు ప్రదర్శన నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో మహిళలు ఒడి బియ్యం సమర్పించి అమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బంగ్ల ప్రవీణ్, రోజా తదితరులు ఉన్నారు.

మైసమ్మ ఆలయంలో సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మైలారం గ్రామంలో కొచ్చెరి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామంలో మంగళవారం భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పర సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప్పర సంఘం సభ్యులు సంగయ్య, సాయిలు, సంతోష్, సాయిబాబు, పోచయ్య, అనసూయ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరాలయం అభివృద్ధికి విరాళం



భిక్కనూరు : మండలంలోని తిప్పాపూర్ గ్రామంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరాలయం అభివృద్ధికి రూ. 51వేల కమ్మరి పుష్ప–కిషన్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి ఆధ్వర్యంలో దాత కుటుంబీకులను శాలువతో మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తాటిపల్లి సిద్దరాములు, ప్రతినిధులు నర్సారెడ్డి, నర్సింహులు ఆలయ పూజారి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం



కామారెడ్డి అర్బన్ : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫలితాల్లో ఐపీఎస్ సాధించిన రాజంపేట మండలం ఆర్గొండకు చెందిన రజనీకాంత్‌ను పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అంబీర్ మనోహర్‌రావు మంగళవారం అభినందించారు. సామాన్య మధ్య తరగతి కుటుంబానికి చెందిన రజనీకాంత్ ఐపీఎస్ సాధించి జిల్లాకే వన్నె తెచ్చారని పేర్కొన్నారు.. ప్రతి విద్యార్థి రజనీకాంత్ ద్వారా స్ఫూర్తి పొందాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రావు అన్నారు.

యువత సానుకూల వైఖరితో ఉండాలి



కామారెడ్డి అర్బన్ : యువత ఒక నిర్దిష్టమైన లక్ష్యంతో విద్యాసాంకేతికాంశాల్లో ముందుకెళ్తే భవిష్యత్తులో మంచి అవకాశాలు పొందుతారని రోటరీక్లబ్ కామారెడ్డి శాఖ అధ్యక్షుడు పోలబోయిన సత్యం అన్నారు. మంగవారం స్థానిక మంజీరా డిగ్రీ కళాశాలలో ‘యువత–భవిష్యత్తు–అవగాహన’ అంశంపై రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మంజీరా కళాశాల డైరెక్టర్ గురువేందర్‌రెడ్డి, మోటివేటర్ కే సత్యనారాయణ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. రోటరీ కార్యదర్శి పి.రాజనర్సింహరెడ్డి, కోశాధికారి తోర్నాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులను కలిసిన మాజీ ఎమ్మెల్యే



నిజాంసాగర్(జుక్కల్) : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో నెలరోజుల పాటు కష్టపడి పనిచేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను మంగళవారం మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే కలిశారు. జుక్కల్, మద్నూర్, నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను మాజీ ఎమ్మెల్యే సింధే స్వయంగా కలిసి బూత్‌ల వారిగా పోలైన ఓట్ల వివరాలను తెలుసుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు దుర్గారెడ్డి, గైని విఠల్, నర్సింహారెడ్డి, నారాయణ, ఆనంద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సఫాయి కార్మికులకు పండ్ల పంపిణీ



రామారెడ్డి : సదాశినగర్ మండల కేంద్రంలో సఫాయి కార్మికులకు, పారిశుధ్య కార్మికులకు మంగళవారం పండ్లు పంపిణీ చేశారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి జన్మదినం సందర్భంగా సఫాయి కార్మికులకు, పారిశుధ్య కార్మికులకు పండ్లు పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ నాయకులు బంటు భూమేష్, తెలిపారు. ఈ కార్యక్రమంలో సఫాయి కార్మికులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామానికి చెందిన చెందిన అలేఖ్య అనారోగ్యంతో బాధపడుతుండగా మెరుగైన శస్త్ర చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి ఎల్‌వోసిని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మంగళవారం అందజేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో రూ. 5 లక్షల ఎల్వోసీ బాధిత కుటుంబానికి అందజేశారు.

చిన్నటాక్లీలో తాగునీటి కష్టాలు



మద్నూర్(జుక్కల్) : డోంగ్లీ మండలంలోని చిన్న టాక్లీ గ్రామస్తులు తాగునీటి కోసం తంటాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం గ్రామ పంచాయతీ కుళాయిల ద్వారా తాగునీరు రాకపోవడంతో గ్రామంలోని బస్టాండ్ వద్ద గల బోరు వద్ద మహిళలు బారులు తీరి నీటిని తీసుకెళ్లారు. పంచాయతీ కుళాయిల ద్వారా వచ్చే నీరు సరిపోవడం లేదని దీంతో నిత్యం తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

సంక్షిప్తం

55వ సారి రక్తదానం



రాజంపేట : పొల్వంచ గ్రామీనికి చెందిన జగదీశ్వర్ రక్త హీనతతో బాధపడుతుండడం బాధిత కుటుంబ సభ్యులు రక్తదాతలను సంప్రదించగా రాజంపేటకు చెందిన బంధం ప్రవీణ్ కుమార్ రక్తదానం చేశాడు. బంధం ప్రవీణ్ కుమార్ ఆర్యబాట్ట జూనియర్ కాలేజీ అర్థశాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. 55సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు.

లాఠీచార్జీ చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలి

బాన్సువాడ : నారాయణఖేడ్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులపై లాఠీచార్జీ చేయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ డిమాండ్ చేశారు. తమ కు రావాల్సిన 5 రోజుల భత్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్యాయంగా వారిపై లాఠీచార్జీ చేశారని, సంబంధిత నిందితులపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలకేంద్రంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో వాహానాలను తనిఖీ చేశారు. లైసెన్స్‌లు, వాహనాల కు సంబంధించిన ధృవీకరణ పత్రాలతో పాటు సీటు బెల్ట్‌లు, హెల్మెట్లు ధరించని వారికి జరిమానా వేశారు. పెండింగ్ చాలాన్లు ఎప్పటికప్పుడు క్లియర్ చేసుకోవాలని పేర్కొన్నారు. తనిఖీల్లో ఏఎస్సై సంజీవులు, కానిస్టేబులు, హోంగార్డులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంగారెడ్డికి తరలిన ఈవీఎంలు


ఈవీఎంలను తరలిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని గీతం యూనివర్సిటీకి తరలించినట్లు అసిస్టెంట్ రెవెన్యూ అధికారి మన్నె ప్రభాకర్ మంగళవారం తెలిపారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఎల్లారెడ్డి సెగ్మెంట్‌కు సంబంధించిన 270 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలు ఓటింగ్ పూర్తి కావడంతో వాటిని సంగారెడ్డికి తరలించామన్నారు. జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు.


కామారెడ్డి నుంచి..